సాక్షి నంద్యాల

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



అన్నదానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి శనివారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన జి.నాగమణి రూ.2 లక్షల విరాళాన్ని పర్యవేక్షణకులు మధుసూదన్‌రెడ్డికి అందజేశారు.



అలరించిన తోలుబొమ్మలాట

శ్రీశైలంటెంపుల్: ఆలయ నిత్య కళా వేదికపై శనివారం కడప జిల్లా బోరుమామిళ్లకు చెందిన సాయినిలయ బృందం వారి వినాయక విజయం తోలుబొమ్మలాట ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.91
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.421
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 73,241
అవుట్ ఫ్లో	: 74,025

న్యూస్‌రీల్

మద్దిలేటయ్యకు రూ.5 లక్షల ఆదాయం



విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామికి శనివారం భక్తులు కానుకల రూపంలో రూ.5,19,033 సమర్పించినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన పాగుంట్ల నరసింహారెడ్డి జ్ఞాపకార్థం వారి భార్య భాగ్యమ్మ, కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధికి రూ.51,000 విరాళం అందజేశారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్‌ఎస్) ద్వారా 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి టెన్త్, ఇంటర్మీడియెట్‌లలో అడ్మిషన్లు పొందడానికి ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 200 అపరాధ రుసుముతో 26 నుంచి 29 వరకు, రూ.500 అపరాధ రుసుముతో 30 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పదవ తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండిన వారు, ఇంటర్‌లో చేరేందుకు 15 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

టెట్‌కు 121 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం జరిగిన టెట్(ఎస్‌ఏ–1, ఎస్‌ఏ–2)కు 121 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 455 మందికి గాను 385 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 454 మందికి గాను 403 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

నంద్యాల(అర్బన్): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు వర్షం కు రిసింది. బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కోవెలకుంట్లలో 20.0, నంద్యాల 18.2, జూపాడుబంగ్లా 13.2, ఆళ్లగడ్డ 13.0, మహానంది 12.4, అవుకు 11.2, శ్రీశైలం 6.8, కొలిమిగుండ్ల 4.2, ఆత్మకూరు 3.8. దొర్నిపాడు, ప్యాపిలి 3.2, రుద్రవరం 3.0, శిరివెళ్ల 2.8, పాణ్యం, గోస్పాడు 2.2, పగిడ్యాల 2.0, డోన్ 0.8, చాగలమర్రి మండలంలో 0.6 మి.మీటర్ల వర్షం కురిసింది.

శ్రీశైలం ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం దేవస్థానం పరిపాలనా భవనంలో ఈఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అర్చకులు, వేదపండితులు వేదాశీస్సులను అందజేశారు. అనంతరం ఇన్‌చార్జ్ ఈఓ అధికారులతో మాట్లాడుతూ కార్తీక మాస ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీగా శ్రీనాథ్



నంద్యాల(న్యూటౌన్): స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీగా నందికొట్కూరు జెడ్పీ బాలుర పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనాథ్‌ను నియమించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం డీఈఓ మాట్లాడుతూ గతంలో పని చేసిన శివకుమార్‌ను తొలగించి, ఆయన స్థానంలో శ్రీనాథ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

సొంతిల్లు.. ఆశలపై నీళ్లు

గత ప్రభుత్వం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేసింది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 323 జగనన్న కాలనీలతోపాటు, సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు 56,523 పక్కాగృహాలు కేటాయించింది. ఈ ఏడాది మార్చి నాటికి ఆయా మండలాల్లో 30,713 పక్కాగృహాలు పూర్తి కాగా 15వేల ఇళ్లు బేస్‌మెంట్, మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

కోవెలకుంట్ల పట్టణ శివారులో జగనన్న కాలనీలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు



- కూటమి ప్రభుత్వంలో కనిపించని ఆదరణ
- మార్చి నాటికి పూర్తి చేయాలని మాత్రం షరతు
- ఇళ్ల నిర్మాణాలకు ఇసుక దొరక్క అవస్థలు
- ఎక్కడికక్కడే నిలిచిన ఇళ్ల నిర్మాణాలు
- జగనన్న కాలనీల పేరుతో ఊళ్లు కట్టించిన గత వైఎస్సార్‌సీపీ సర్కార్

నాడు

పేదల సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి లబ్ధిదారులకు అన్ని విధాలా అండగా నిలిచింది. ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలంతోపాటు మూడు విడతల్లో రూ.1.80 లక్షల బిల్లులు అందజేసి, ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై సిమెంట్, కడ్డీలు, గృహ నిర్మాణ సామగ్రి ఇచ్చి పేదలకు సొంతింటి కల నెరవేర్చింది.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ఇళ్ల నిర్మాణాలకు అనేక షరతులు విధించి పేదల సొంతింటి ఆశలపై నీళ్లు చల్లుతోంది. ఇప్పటికే ప్రారంభించిన ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని నిబంధన విధించింది. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతోపాటు ఇప్పటి వరకు ప్రారంభంకాని గృహ నిర్మాణాలను పూర్తిగా నిలిపివేసింది. ఇక కొత్త ఇళ్ల మంజూరు ఊసే ఎత్తడం లేదు.

కోవెలకుంట్ల: 2014 నుంచి 2019 మధ్య కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు. పక్కాగృహాలు మంజూరు చేయలేదు. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ప్రైవేట్ లే అవుట్లను తలపించేలా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా ప్రస్తుత కూటమి సర్కార్ పలు ఆంక్షలు విధించింది. వచ్చే ఏడాది మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని షరతు పెట్టింది. ఇప్పటి వరకు ప్రారంభించని ఇళ్ల నిర్మాణాల అనుమతిని రద్దు చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూ డు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ఇంత వరకు కొత్త ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభించలేదు. పైగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేదని సాకు చూపుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోంది. కొత్తగా పక్కాగృహాలు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ మరో వైపు మన ఇల్లు– మన ప్రభుత్వం పేరుతో హంగామా చేస్తోందని పలువురు ప్రభుత్వ తీ రుపై విమర్శలు చేస్తున్నారు. లేఅవుట్ల వద్ద లబ్ధిదారు లు, అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రతి శనివారం సమావేశం ఏర్పాటు చేయడంపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ఎలాంటి ఆర్థిక ప్రయోజనం కల్పించకుండా ఈ సమావేశాలేంటని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు. మార్చిలోపు ఇళ్లు కట్టుకోకపోతే రద్దు చేస్తామనే నిబంధనపై ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో అడుగడుగునా సాయం..

పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కార్ అడుగడుగునా సాయమందించింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను మూడు విడతల్లో అందజేసింది. బేస్‌మెంట్ వేసుకునేందుకు చేతిలో డబ్బు లేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా, హౌస్‌లోన్ పర్పస్(హెచ్‌ఎల్‌పీ) ద్వారా రూ.35వేలు మంజూరు చేయించింది. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు ఆర్థిక వెసలుబాటు కల్పించింది. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు డబ్బు లేని ఒక్కో లబ్ధిదారురాలికి రూ.20 వేలు అడ్వాన్స్ రూపంలో వారి ఖాతాల్లో జమ చేసి ఆదుకుంది. జిల్లాలోని ఆయా మండలాల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు హెచ్‌ఎల్‌పీ, అడ్వాన్స్‌తోపాటు జగన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకునే లబ్ధదారులకు ఏ మాత్రం భారం పడకుండా గత ప్రభుత్వం భరోసా కల్పించింది. ఇంటి నిర్మాణం ఎక్కడ ఆగిందో తెలుసుకుని నిర్మాణం పూర్తి చేసేందుకు డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా అదనంగా రూ. 50వేలు, అది చాలకపోతే రూ.లక్ష వరకు రుణాన్ని అందించింది. జిల్లాలో 56 వేల పక్కాగృహాలు మంజూరు కాగా 35 వేల మంది లబ్ధిదారులు పొదుపు సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం మూడు విడతల్లో ఇచ్చే రూ.1.80 లక్షలతోపాటు అదనపు రుణం అందజేసింది. తీసుకున్న రుణంలో రూ.35 వేల వరకు పావలా వడ్డీ వర్తించింది. ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాలకు(ఉన్నతి) వడ్డీ లేకుండా అదనపు రుణం అంది జేసి ఆదుకుంది. జగనన్న కాలనీలతోపాటు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు మూడు విడతల్లో బిల్లు అందజేసింది. బేస్‌మెంట్ దశలో సిమెంట్, స్టీల్‌తో కలుపుకుని రూ.70వేలు, లింటల్‌లెవల్‌లో రూ.54వేలు, రూఫ్ లెవల్‌లో రూ.25వేలతోపాటు, ఉపాధి హామీ పథకం కింద రూ.30 వేల చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. వీటితోపాటు ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఒక్కో లబ్ధిదారురాలికి ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై కిటికీలు, చౌకట్లు, బాత్‌రూం డోర్ ఫ్రేమ్‌లు, ఎలక్ట్రికల్ సామగ్రిని అందజేసింది.

ఇళ్ల నిర్మాణాలకు రూ.4 లక్షలు ఇవ్వాలి



పట్టణ శివారులోని ఎస్సార్సీసీ జగనన్న కాలనీలో ఇంటిస్థలంతోపాటు పక్కాగృహం మంజూరైంది. ఇంటి నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్ పూర్తి చేశాను. ప్రభుత్వం రూ.55వేలు బిల్లు జమ చేసింది. లింటల్‌లెవెల్ పనులకు చేతిలో డబ్బు లేకపోవడంతో గత ప్రభుత్వం అడ్వాన్స్‌గా రూ. 20 వేలు అందించి ఆదుకుంది. నిర్మాణ దశలో ఉన్న ఇంటిని పూర్తి చేసుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం రూ.4 లక్షలు ఇచ్చి ఆదుకోవాలి.

– సంధ్య, లబ్ధిదారురాలు, కోవెలకుంట్ల

జగనన్న పుణ్యమే..



సొంతిల్లు లేకపోవడంతో చిన్నపాటి ఇంట్లో తల్లిదండ్రులతోపాటు కాలం వెల్లదీస్తూ వచ్చాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలంతోపాటు పక్కాగృహం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక, రాయితీపై కడ్డీలు, సిమెంట్, రూ.1.80 లక్షల బిల్లు అందజేయడంతో సొంతంగా ఇల్లు నిర్మించుకున్నాను. కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో ఏడాదిన్నర క్రితం చేరి సొంతింటి కలను నెరవేర్చుకున్నానంటే అది జగనన్న పుణ్యమే.

– చిన్నపుల్లయ్య, లబ్ధిదారుడు, ముక్కమల్ల, సంజామల మండలం

పక్కాగృహం మంజూరు చేయాలి



జిల్లాలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేయాలి. గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరుకంతా పూర్తి చేయాలనే నిబంధన తీసేయాలి. ఇల్లు లేని ఎంతో మంది పేదలు బాడుగ ఇల్లు, రేకుల షెడ్లలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి పక్కాగృహాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

– సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కోవెలకుంట్ల

ప్రహ్లాదవరదా.. మది పరవశించదా!

- పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన అహోబిల పవిత్రోత్సవాలు



విశేషాలంకరణలో ఉత్సవమూర్తులు ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారు



గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో వెలసిన ప్రహ్లాదవరదస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శనివారం తెల్లవారుజామున పూర్ణాహుతితో ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున మూలమూర్తులు ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదులను యాగశాలలో కొలువుంచి నవకళస్థాపన, అభిషేకం నిర్వహించి నూతన పట్టు పీతాంబరాలతో అలంకరించి కొలువుంచి పవిత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి నిత్యపూజ అనంతరం శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, అర్ధరాత్రి అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లకు తిరుమంజనం, సంప్రోక్షణం, శనివారం తెల్లవారుజామున శాత్తుమురై గోష్టితో పవిత్రోత్సవాన్ని ముగించారు. కార్యక్రమాలను అహోబిలం ప్రధానార్చకులు శ్రీమాన్ శఠకోప వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారయన్ ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాల నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన వేద పాఠశాలల పండితులు నిర్వహించారు.

అనుకున్నదొక్కటి.. అయ్యిందొక్కటి!


- ఏఓపై క్షమశిక్షణ చర్యలకు టీడీపీ నాయకుడి హుకుం
- అధికారుల అత్యుత్సాహంతో ఏఓకు మంచి ప్లేస్.. అక్కడ పని చేస్తున్న ల్యాబ్ ఇన్‌చార్జ్‌కు జిల్లా సరిహద్దులో ఆన్‌డ్యూటీ
- మనస్తాపంతో సెలవుపై వెళ్లిన ల్యాబ్ ఇన్‌చార్జ్



ఆళ్లగడ్డ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

ఆళ్లగడ్డ: కూటమి ప్రభుత్వంలో అధికారుల పోస్టింగ్‌లు కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతున్నాయి. ప్రజాప్రతినిధుల కక్ష సాధింపులతో కొందరు ఉద్యోగులు.. అధికారుల అత్యుత్సాహానికి మరికొందరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆళ్లగడ్డ అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జ్ నాగేంద్రప్రసాద్ ఘటనే ఇందుకు ఉదాహరణ. రుద్రవరం వ్యవసాయాధికారి శ్రీకృష్ణపై తీసుకున్న చర్యలు ఆళ్లగడ్డ అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జ్ నాగేంద్రప్రసాద్‌కు ఇబ్బందిగా మారాయి. విశ్వసనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు.. రుద్రవరం మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ గతంలో అవుకు మండలంలో పని చేశారు. ఆ సమయంలో బనగానపల్లె టీడీపీ నాయకుడికి అతనికి ఏం జరిగిందో తెలయదు కానీ.. టీడీపీ నాయకుడు మాత్రం కక్ష గట్టాడు. ప్రస్తుతం ఆ నాయకుడు వ్యవసాయాధికారి శ్రీకృష్ణకు పనిష్మెంట్ కింద ఒరిస్సా బోర్డర్‌కు వేయాలని సంబంధిత శాఖ మంత్రి ద్వారా వ్యవసాయాధికారులకు సిఫార్స్ చేయించారు. సదరు శాఖ అధికారులు జోన్ దాటి బదిలీ చేయడం నిబంధనలకు విరుద్ధమని తలచి తర్జనభర్జన పడ్డారు. జిల్లాలోనే పనిష్మెంట్ కింద ఏదైనా లూప్‌లైన్‌లో ఉంచాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆఘమేఘాల మీద అతడిని ఆళ్లగడ్డ ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా ఓడీ(ఆన్ డ్యూటీ) కింద పంపారు. ఈక్రమంలో ఆళ్లగడ్డ ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా ఉన్న నాగేంద్రప్రసాద్‌ను రుద్రవరం ఏఓగా ఓడీ(ఆన్ డ్యూటీ) కేటాయించారు. నాగేంద్రప్రసాద్‌కు ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా ఉండటానికి ప్రత్యేక శిక్షణ పొందిన అర్హతలు ఉండటంతోపాటు నిజాయతీ గల అధికారిగా పేరు. అలాంటి అధికారిని మాటమాత్రానికైనా సంప్రదించకుండా ఉన్నఫలంగా రుద్రవరం మండలానికి ఓడీ కింద పంపుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన మనస్తాపంతో వాటిని తీసుకోకుండానే సెలవు పెట్టి వెళ్లినట్లు సమాచారం. కాగా ఎలాంటి శిక్షణ పొందని శ్రీకృష్ణను ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా వేయడంతో రైతులకు కూడా పెద్దగా ప్రయోజనం ఉండదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నకిలీ విజిలెన్స్ ముఠా అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ



నిందితులు ఉపయోగించిన కారు

ఓర్వకల్లు: విజిలెన్స్ అధికారులమంటూ బియ్యం వ్యాపారిని బెదిరించిన ఐదుగురితో కూడిన ముఠాను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఆళ్లగడ్డ బాలాజీ వీధికి చెందిన పాలకంటి మధుసూదన్, నంద్యాల రైతు నగర్‌కు చెందిన శీలం అంకిరెడ్డి, పాణ్యం మండలం మద్దూరుకు చెందిన పరదేశి రవికుమార్, నంద్యాల శ్రీనివాస సెంటర్‌కు చెందిన కొరతాల మహేష్, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఆవుల మధు ముఠాగా ఏర్పడ్డారు. జల్సాల కోసం పైరవీలు చేసేవారు. ఓ స్కార్పియో వాహనాన్ని కొలుగోలు చేసి దానికి విజిలెన్స్ అధికారుల బోర్డు పెట్టుకొని ఆర్థిక నేరాలకు పాల్పడేవారు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో నన్నూరు సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో నివాసముంటున్న బియ్యం వ్యాపారి గంగాధర్ వద్దకు వెళ్లి విజిలెన్స్ అధికారులంటూ బెదిరించారు. రూ.2.50 లక్షలు ఇవ్వకపోతే అరెస్టు చేస్తామనడంతో వ్యాపారి రూ.10 వేలు చెల్లించుకున్నాడు. అంతలోనే అనుమానం వచ్చి.. తహసీల్దార్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అయ్యింది. ఈక్రమంలో తమ బండారం బయటపడుతుందని భావించిన దుండగులు పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని మళ్లీ బెదిరించారు. సదరు ఫోన్‌కాల్ కర్నూలు డీఎస్పీకి వెళ్లడంతో ఆయన తన దైన శైలిలో ఆరా తీసి, వ్యవహారం తేడాగా ఉందని గుర్తించి వెంటనే ఓర్వకల్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్‌కు సమాచారం చేరవేశారు. ఆయన తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకునేలోపు దుండగులు పరారయ్యారు. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం ఉదయం హుసేనాపురంలో ఓ హోటల్ వద్ద టీ తాగుతూ కనిపించడంతో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు వాహనాలు, 7 సెల్ ఫోన్లు, ఐడీ కార్డులు, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

లెగసీ శుద్ధీకరణ త్వరగా పూర్తి చేయాలి

- కడప అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర



దంప్ యార్డును పరిశీలిస్తున్న కడప అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర

నంద్యాల(సిటీ): పట్టణంలోని డంప్‌యార్డులో జరుగుతున్న లెగసీ శుద్ధీకరణ పనులలో అలసత్వం వీడాలని కడప అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్ర సూచించారు. శనివారం నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డితో లెగసీ శుద్ధీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన లెగసీ శుద్ధీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో రోజువారీ వెలువడుతున్న వ్యర్థాలను వేరు చేసే విధానంపై మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తిని ఆరా తీశారు. చెత్త ద్వారా సంపద ఎలా సృష్టించాలో, చెత్తను రీసైక్లింగ్ ఏఏ పద్ధతుల్లో చేయాలో వివరించారు. పొడి, తడి చెత్తలతో వర్మీకంపోస్టు తయారీ, ప్లాస్టిక్ కారకాలను కర్మాగారాలకు తరలించే పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈఈ అబ్దుల్ రసూల్ ఉన్నారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఐదారు రోజుల కిత్రం వరకు క్వింటాలు ధర రూ.4,000 లోపు ఉంది. ఈ నెల 10న గరిష్ట ధర రూ.3,829 ఉండగా.. 14 నుంచి పెరుగుదల మొదలైంది. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 208 మంది రైతులు 4,643 క్వింటాళ్లు తెచ్చారు. కనిష్ట ధర రూ.495, గరిష్ట ధర రూ. 4329 లభించింది. సగటు ధర రూ.3,591 నమోదు అయింది.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతి నగర్‌లోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విరివిగా రుణాలివ్వండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల లబ్ధిదారులకు విరివిగా రుణాలిచ్చి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బ్యాంకర్లు, అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రభుత్వ పథక రుణాల మంజూరుపై జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి బ్యాంకర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నరసింహారావు, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ వెంకటరమణ, ఫైనాన్స్ లిటరసీ ప్రతినిధి ఆంజనేయులు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు పరిశ్రమ కావాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పీఎంఎఫ్ఎంఈ, ముద్ర లోన్లు, చేనేత కార్మికులు, స్వయం సహాయక సంఘాలు, పీఎంఈజీపీ, పశుపోషణ తదితర రుణాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను సాధించలేకపోవడానికి కారణాలను విశ్లేషించాలన్నారు. రుణాలు మంజూరులో జాప్యంపై బ్యాంకర్లను ప్రశ్నిస్తూ బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని లబ్ధిదారులకు రుణాలు మంజూరులో జిల్లాను టాప్ 5లో ఉంచాలన్నారు. కౌలు రైతులకు, పారిశ్రామిక రంగాలకు, పశుపోషణకు, చేపల ఉత్పత్తిదారులకు లక్ష్యానికి మించి రుణాలు అందజేయాలన్నారు. బ్యాంకుల వారీగా లక్ష్యాల ప్రగతిపై ప్రతి 15 రోజులకోసారి నివేదికలు అందజేయాలన్నారు. నవంబర్ రెండో వారంలో జరిగే సమావేశానికి 50 శాతం లక్ష్యం పూర్తి కావాలన్నారు.

క్లుప్తంగా

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి

పెద్దకడబూరు : ఆటోలో నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామ సమీపంలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ నిరంజ న్‌రెడ్డి వివరాల మేరకు.. హెచ్.మురవణి గ్రామానికి చెందిన ఓతూరు నాగరాజు భార్య జయమ్మ(57) శనివారం తోటి కూలీలతో కలిసి పొలం పనులకు ఆటోలో బయలు దేరింది. గ్రామ సమీపంలోని ఎమ్మిగనూరు – మాల పల్లి ప్రధాన రహదారిలో నాలుగో మైలురాయి దాటిన తరువాత విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర డ్రైవర్ ఆటోను వేగంగా నడపడంతో అందులో నుంచి జయమ్మ కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు భర్త ఓతూరు నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతి చెందిన బోయ మంజుల

కోడుమూరు రూరల్: అనుగొండ గ్రామంలో పొలం పనులు చేస్తుండగా పిడుగు పాటుకు గురై ఓ మహిళ మృతిచెందారు. శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. అనుగొండకు చెందిన బోయ బాల మద్దిలేటి భార్య బోయ మంజుల (35) మరో నలుగురు మహిళలతో కలిసి శనివారం పొగాకు పొలంలో కలుపుతీతకు వెళ్లింది. అయితే, సాయంత్రం సమయంలో చిన్నపాటి వర్షం మొదలై వీరికి సమీపంలో పిడుగు పడింది. పిడుగు దాటికి పొలంలో పనిచేస్తున్న మంజులతో పాటు, లక్ష్మీదేవి, అనేశ్వరి, అనురాధ, మహేశ్వరిలు స్పృహ తప్పి పడిపోయారు. కొద్దిసేపటికి వీరంతా కోలుకుని లేవగా మంజుల మాత్రం స్పృహలోకి రాలేదు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి భర్త బాలమద్దిలేటితో పాటు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం.

ఆగని బెదిరింపుల పర్వం

- సీఎంకు మొరపెట్టుకున్న ఓ మద్యం దుకాణాదారుడు
- సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్

బేతంచెర్ల: అధికారపార్టీ నాయకుల ఆగడాలు పెరిగిపోయాయి. లాటరీల్లో మద్యం షాపులు పొందిన వారిని వివిధ రూపాల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాట వినని వారిని దుకాణం తెరవనివ్వకుండా, మద్యం విక్రయించకుండా చేస్తున్నారు. తాజాగా బేతంచెర్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి సీఎం గారూ మీరే సహకరించాలని విడుదల చేసిన వీడియో వైరల్ అవుతోంది. పట్టణానికి చెందిన కల్లూరి లోకేష్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి మద్యం షాపుల కోసం 18 దరఖాస్తులు చేశాడు. ఈనెల 14 వ తేదీన నిర్వహించిన లక్కీడ్రాలో బేతంచెర్ల పట్టణంలోని 72వ షాపు దక్కింది. ఈ దుకాణం దక్కించుకున్న లోకేష్ స్నేహితులతో కలిసి సరుకుకు రూ. 26 లక్షలు డిపాజిట్ చేశాడు. శనివారం పాతబస్టాండ్ సమీపంలో దుకాణం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ ఉదయాన్నే మద్యం కోసం తాము ఇచ్చిన డబ్బు వెనక్కి ఇవ్వాలని స్నేహితులు ఒత్తిడి పెంచారు. మద్యం షాపు దక్కకపోడంతో అధికారపార్టీ నాయకులు తన స్నేహితులను బెదిరించి షాపు తెరవకుండా అడ్డుకుంటున్నారని శనివారం లోకేష్ వీడియో విడుదల చేశాడు. మీరే ఆదుకోవాలని సీఎం చంద్రబాబును అందులో వేడుకున్నాడు. కూటమి నాయకులు ఇతరులను బతికనివ్వడం లేదని, మద్యం వ్యాపారమంతా తమ గుప్పిట్లో ఉండాలని దుకాణాలు దక్కిన సామాన్యులను బెదిరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామ సమీపంలో నీట మునిగిన మిరప పంట



నందికొట్కూరు సమీపంలో పొగాకు పొలంలో నిలిచిన వర్షపు నీరు



దేవనకొండలో వర్షం రావడంతో పత్తి విడిపించకుండా వదిలేసిన దృశ్యం



కౌతాళం మండలం మేళిగనూరులో నేలకొరిగిన వరిపైరు

ఎంత కష్టం.. ఎంత నష్టం!





బొల్లవరం గ్రామంలో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు (ఇన్‌సెట్) దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో మొక్కజొన్న కంకులకు మొలకలు వచ్చిన దృశ్యం

రైతన్నల ఆశలు ఆవిరయ్యాయి. చేతికి వచ్చిన పంటలు వర్షం పాలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఐదారురోజులుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నంద్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాల్లో మోకాళ్లలోతు నీరు నిలవడంతో పైర్లు కుళ్లిపోతున్నాయి. వరి పంట నేలకొరగగా పత్తి, మొక్కజొన్న, ఉల్లి పంటలు తడిసిముద్దయ్యాయి. నందికొట్కూరు, శ్రీశైలం, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో పంట దిగుబడులు వారం రోజులుగా పట్టల కింద ఉండటంతో రంగు మారాయి. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్/నెట్ వర్క్



హొళగుందలో కుళ్లిన ఉల్లిని వేరు చేస్తున్న మహిళలు



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది



గార్గేయపురం సమీపంలో కోతకోసి పొలంలోనే వదిలేసిన ఉల్లి పంట

హత్య కాదు.. ఆత్మహత్య!

- నగురూరు ప్రేమికుల వ్యవహారంలో కొత్త కోణం
- ప్రేమికులను గదిలో వేసి చితకబాదిన బంధువులు
- అవమానభారంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు తెగించిన అశ్విని
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఆస్పరి: నగురూరులో ప్రేమజంట వ్యవహారంలో కొత్త కోణం వెలుగు చూసింది. మృతి చెందిన అశ్వినీది హత్య కాదు.. ఆత్మహత్య అని తెలుస్తోంది. గ్రామస్తులు, పోలీసు వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అశ్విని, సన్నీ అనే ఇద్దరు మైనర్లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం అశ్విని తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో సన్ని మాట్లాడేందుకు వెళ్లాడు. పక్కింటి వ్యక్తి గమనించి ఇంటికి తలుపు వేసి అశ్విని బంధువులు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి ఇద్దరిని చితకబాదారు. దాడి నుంచి సన్ని తప్పించుకుని పారిపోయాడు. ఈ దాడిలో అతని తలకు బలమైన గాయమైంది. ఆపై అశ్వినిని వారి బంధువుల ఇంట్లో ఉంచారు. ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడం, తమపై కూడా తల్లిదండ్రులు చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన అశ్విని పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అశ్విని, సన్నీ ఫోన్ రికార్డులు, వాట్సాప్ స్క్రీన్‌షాట్లు పోలీసులు తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదటగా అశ్విని ప్రేమించలేదని, సన్నీ పురుగు మందు బలవంతంగా తాపి చంపారనే ప్రచారం జరగడంతో ఈ అంశం కలకలం రేపింది.

వేధింపులు తాళలేక ఆత్మహత్య

సన్ని, అశ్విని వ్యవహారంలో పలు రకాలు వార్తలు వ్యాపిస్తున్నాయి. సన్ని వెంటపడి వేధిస్తున్నారనే కారణంతోనే అశ్విని పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. సన్ని ఎక్కడ ఉన్నాడో తెలీదు. దర్యాప్తులో పూర్తి విషయాలు వెలుగు చూస్తాయి.

– మస్తాన్ వలి, సీఐ, ఆస్పరి

ఎర్రమట్టి అక్రమ రవాణా



అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు

డోన్: పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో ఎర్రమట్టి మాఫియా చెలరేగిపోతోంది. రెవెన్యూ, అటవీ, పోరంబోకు భూములతోపాటు చెరువులు, కుంటలను యథేచ్ఛగా తవ్వి ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. దీంతో గృహ అవసరాలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎర్రమట్టి కాసుల వర్షం కురిపిస్తోంది. ఓబులాపురం, లక్ష్మంపల్లె, అబ్బిరెడ్డిపల్లె చెరువు, గుడితిప్ప ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వందలాది ట్రాక్టర్ల ద్వారా ఎర్రమట్టిని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

- పోలీసు స్టేషన్ ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల బైఠాయింపు



పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన మృతురాలు శిరీష కుటుంబ సభ్యులు, బంధువులు

నందికొట్కూరు: కోరిక తీర్చలేదని గొల్ల శిరీషను హత్య చేసిన మామ కురుమన్నను ఎన్‌కౌంటర్ చేయాలని, వేధింపులకు పాల్పడిన భర్త, అత్త, ఆడపడుచులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పోలీసుస్టేషన్ ఎదుట కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై శిరీష హత్యను నిరసిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. హంతకుడిని తమకు అప్పగించాలంటూ పోలీసు స్టేషన్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో సీఐ సుబ్రమణ్యం జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అలాగే శిరీషను హత్య చేసిన సొంత మామ కురుమన్నను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకుడు వి.రఘురామ్మూర్తి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజిత డిమాండ్ చేశారు. పటేల్ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు.

కాల్వలో దొంగల హల్‌చల్!

- వరుసగా నాలుగు ఇళ్లల్లో దోపిడీ
- రూ.3.40 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం అపహరణ



బీరువాలో చెల్లాచెదురుగా వస్తువులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. శుక్రవారం రాత్రి తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బీరువాలు పగలగొట్టి అందినకాడికి బంగారు, నగదు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన మహబూబ్‌బీ ఇంటి తలుపునకు అమర్చిన ఇనుప హ్యాండిల్‌ను కట్టర్‌తో కత్తిరించి లోపలికి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.3 లక్షల నగదు, 4 తులాల బంగారం దోచుకెళ్లారు. అలాగే మంగలి సుబ్బమ్మ ఇంట్లో తాళం పగలగొట్టి రూ.40 వేలు, జాకిర్ బాష ఇంట్లో రూ.700 నగదు, దేశాయ్‌నూర్ ఇంట్లో 6 గ్రాముల చెవికమ్మలు ఎత్తుకెళ్లారు. శనివారం ఇళ్లకు చేరుకున్న బాధితులు తాళాలు తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ గ్రామానికి చేరుకొని క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జెన్‌కో గృహం అన్యాక్రాంతం



జెన్‌కో గృహం

శ్రీశైలంప్రాజెక్ట్: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారి సహకారంతో ప్రైవేట్ వ్యక్తులు శనివారం ఏపీ జెన్‌కోకు చెందిన ప్రభుత్వ గృహాన్ని ఆక్రమించుకున్నారు. తాళాలు పగుల గొట్టి మరీ ఆగృహంలోకి గృహోపకరణాలను చేర్చారు. ఏపీ జెన్‌కో ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ఉద్దేశంతో సదరు అధికారికి శ్రీశైలం జెన్‌కోలో పోస్టింగ్ ఇచ్చారు. కానీ ఆయన మాత్రం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే జెన్‌కో అధికారులను లెక్క చేయకుండా, పవర్‌హౌస్, జెన్‌కో కాలనీ, గ్రామంలోని జెన్‌కోకు సంబంధించిన కీలక అంశాలను బహిర్గతం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న సదరు ఎస్పీఎఫ్ అధికారిని గతంలోని చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు కూడా అప్పట్లో విచారించినట్లు సమాచారం. జెన్‌కో గృహం ఆక్రమణ విషయమై ప్రస్తుత చీఫ్‌ఇంజినీర్ కాంతారావును వివరణ కోరగా.. ఎస్పీఎఫ్ ఎస్‌ఐ ఆధీనంలో ఉందని, ఏ పొరపాటు జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్పీఎఫ్ ఆర్‌ఐ డి.వి.రమణను వివరణ కోరగా అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదు రావడంతో అక్కడికి వెళ్లి ఆ గృహాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు.